సాక్షి హనుమకొండ

మంగళవారం | 6 | మే | 2025



'సోలార్'పై విముఖత

భారీ పెట్టుబడి, గిట్టుబాటు కాని ధర, రుణం పై బ్యాంకర్లకు స్పష్టత లేకపోవడంతో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. - 8లో▸



సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు ముమ్మరం - 8లో▸

కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు జరిగే సరస్వతి నది పుష్కరాలకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $38^0/25^0$

ఉదయం నుంచి ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి పూట ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

భద్రకాళికి గంధోత్సవం



హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీభద్రకాళి దేవాలయంలో అమ్మవారికి గంధోత్సవం నిర్వహించారు. అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యాన అమ్మవారి స్వపనమూర్తికి గంధంతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తిని సాలభంజిక వాహనంపై ప్రతిష్ఠించి ఊరేగించారు. పూజా కార్యక్రమాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాల పద్మశాలి సంఘం వారు ఉభయదాతలుగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్, మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్, కో–ఆర్డినేటర్ నరేందర్, కుసుమ సతీశ్, సాంబారి సమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు ఉచిత శిక్షణ.. దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి యూపీఎస్సీ సీఎస్ఏటీ–26 ఉచిత శిక్షణకు మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల మైనార్టీ సంక్షేమాధికారి డి.మురళీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష మెరిట్ ద్వారా అర్హులను ఎంపిక చేస్తామని, ఆన్‌లైన్ దరఖాస్తులు సీఈటీ.సీజీజీ.జీటీవీ.ఇన్‌టెమ్రిస్ వెబ్‌సైట్‌లో ఉన్నాయని, ఈనెల 24 వరకు చివరి తేదీగా పేర్కొన్నారు. వచ్చేనెల 5న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న టెమ్రిస్ గురుకులాల్లో స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని తెలిపారు. వివరాలకు హనుమకొండ కలెక్టరేట్‌లో లేదా 040–232361120 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'డీపీఎల్' పోస్టర్ ఆవిష్కరణ



ఎంజీఎం: డాక్టర్లు 'బీ ఫిట్ టు ట్రీట్' ఉద్దేశ్యంతో వరంగల్ డాక్టర్స్ క్రికెట్ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్తంగా ఈనెల 17 నుంచి 26 వరకు కాకతీయ మెడికల్ కాలేజీ మైదానంలో డాక్టర్స్ పీమియర్ లీగ్ (డీపీఎల్) నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఐఎంఏ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పది రోజులు జరిగే ఈలీగ్‌లో 150 మంది డాక్టర్లు 8 బృందాలుగా ఏర్పడి 15 మ్యాచ్‌లు ఆడనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సెక్రటరీ అజిత్ మహ్మద్, ఫైనాన్స్ సెక్రటరీ శిరీష్‌కుమార్, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ పి.విజయచందర్‌రెడ్డి, డబ్ల్యూడీసీసీ సెక్రటరీ రాఘవేంద్ర ప్రదీప్, వైస్ ప్రెసిడెంట్ ప్రసన్న, నాయకులు సంధ్యారాణి, జనార్దన్, బందెల మోహన్‌రావు, రమేశ్ పాల్గొన్నారు.

8న జాబ్ మేళా..

హన్మకొండ అర్బన్: నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 8న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పేటీఎం, జస్ట్ డయల్, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్–ఎస్‌బిఐటీల్లో ఫీల్డ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, సర్టిఫైడ్ ఇంటర్నెట్ కన్సల్టెంట్, డిప్యూటీ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి 30 మందిని ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. వయసు 18–35 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎస్సెస్సీ, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్‌లతో 8న ఉదయం 11 గంటల వరకు ములుగు రోడ్డు ఐటీఐ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో హాజరు కావాలన్నారు. వివరాలకు 78933 94393 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపు చర్చా గోష్ఠి

హన్మకొండ కల్చరల్ : ఈనెల 7న ఉదయం 10 గంటలకు హనుమకొండ పింజర్ల రోడ్డులోని రాజ రాజనరేంద్రాంధ్ర భాషా నిలయంలో తెలుగుభాష పరిరక్షణపై చర్చా గోష్ఠి నిర్వహిస్తున్నట్లు కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య, ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి టోల్ ఫ్రీ

వరంగల్: జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తితే కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3424కు సమాచారం అందించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

పశుసంవర్ధక శాఖలో మళ్లీ కలకలం

- యూనిట్ల వివరాలివ్వాలని ఈడీ నోటీసులు
- డీవీఏహెచ్‌ఓలను ఆరా తీస్తున్న 'విజిలెన్స్'
- కొందరు వీఏఎస్‌లను విచారణకు పిలిచిన ఏసీబీ?
- రిటైర్డ్ అయినా తప్పని ఎంక్వైరీ.. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పైనా పేచీ..



ఓరుగల్లుకూ గొర్రెల స్కాం సెగ!

సాక్షిప్రతినిధి, వరంగల్ :

గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాల బాగోతంపై మళ్లీ విచారణ ఉమ్మడి వరంగల్‌లో కలకలంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గొర్రెల పంపిణీలో అక్రమాల కేసును సీరియస్‌గా తీసుకుని విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో ఏడాది క్రితం వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీలు వేర్వేరుగా పలుకోణాల్లో విచారణ చేపట్టాయి. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్థాయి మొదలు ఆ శాఖ కీలక అధికారుల వరకు సుమారు 42 మందిపై మూడు శాఖలు అభియోగాలు మోపాయి. ఇందులో ఎనిమిది మంది ఉమ్మడి వరంగల్‌లో పనిచేసిన వారు కూడా ఉన్నారు. సుమారు రూ.700 నుంచి రూ.1,200 కోట్ల వరకు స్కాం జరిగినట్లు ప్రాథమిక నివేదిక ఇచ్చిన నిఘావర్గాలు.. కొందరిని అరెస్టు చేసి.. మరికొందరిపై శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేశాయి. ఆ కేసుల్లో ఉండి ఏడాదిలో ఉద్యోగ విరమణ చేసిన నలుగురు అధికారుల బెనిఫిట్స్ కూడా నిలిపి వేశారు. తాజాగా ఈ కుంభకోణంలో కీలక వ్యక్తిగా కాంట్రాక్టర్ మొయినొద్దీన్ దుబాయికి పరారు కావడంతో అక్కడ బ్రేక్ పడింది. తాజాగా మొయినొద్దీన్‌కు సంబంధించిన ఇంటిపై దాడులు నిర్వహించి పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్న ఏసీబీ.. ఆయన దగ్గర, ఆయన ద్వారా కొన్న పలువురిని విచారణకు పిలుస్తుండడం ఆశాఖలో కలకలం రేపుతోంది.

ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులపై దృష్టి

ఇదిలా ఉండగా 2017 నుంచి 2024 వరకు గొర్రెల పంపిణీ పథకంలో కీలకంగా వ్యవహరించి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులపై మళ్లీ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దృష్టి సారించింది. వరంగల్ కేంద్రంగా ఉన్న కార్యాలయానికి చెందిన ఇద్దరు అధికారులపై రెండు నెలల క్రితం హనుమకొండ డీవీఏహెచ్‌ఓ కార్యాలయంలో ఆరా తీశారు. అలాగే గతంలో ఆరోపణలు ఎదుర్కోవడంతో పాటు సస్పెన్షన్‌కు గురై తిరిగి కొలువులో చేరిన కొందరికీ హైదరాబాద్ నుంచి ఏసీబీ మూడు రోజుల క్రితం నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

వీటిలోనే అక్రమాల లెక్కలు..

ఉమ్మడి వరంగల్‌లో 2017 జూలైలో గొర్రెల పంపిణీ పథకం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లోని గొల్ల, కురుమల కుటుంబాలను పరిగణనలోకి తీసుకొని గ్రామ సంఘంలో సభ్యత్వం ఉన్న వారికి రెండు విడతల్లో గొర్రెలు పంపిణీ చేశారు. మొదటి విడతలో 50 శాతం, రెండో విడతలో మరో 50 శాతం మంది చొప్పున 575 సహకార సంఘాలకు చెందిన 60 వేల మందికి మొదటి విడత(ఎ–లిస్టు)లో 49,276 యూనిట్లు పంపిణీ చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రతి యూనిట్‌కు 20 గొర్రెలు, ఒక పొట్టేలు చొప్పున జిల్లాల వారీగా కోటా నిర్ణయించారు. ఒక్కో జిల్లా నుంచి ఇద్దరు ఏడీలు, ఒక డాక్టర్, ఇద్దరు పారా సిబ్బంది కమిటీగా.. ఉమ్మడి జిల్లాలో సుమారు 12 కమిటీల ద్వారా కొనుగోళ్లు, పంపిణీ చేపట్టారు. రెండో విడతలో 47,750 యూనిట్లకు ప్రణాళిక సిద్ధం చేశారు. దాని ప్రకారం వరంగల్ అర్బన్ జిల్లాలో 5,571 యూనిట్లు, వరంగల్ రూరల్‌లో 12,748, మహబూబాబాద్‌లో 11,868, భూపాలపల్లి/ములుగు జిల్లాల్లో 6,791, జనగామ జిల్లాలో 10,772 యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉండగా 12,123 యూనిట్ల తర్వాత అక్రమాలు వెలుగుచూడటంతో నిలిపివేశారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా విచారణకు ఆదేశించడం.. ఏడాది క్రితం అంతా అయిపోయిందని భావించిన తరుణంలో రెండు రోజులుగా మళ్లీ విచారణ స్పీడందుకుంది. ఉమ్మడి వరంగల్ అక్రమాలపైన మళ్లీ నోటీసులు జారీ కావడం లాంటి పరిణామాల నేపథ్యంలో బాధ్యులైన పశుసంవర్ధక శాఖ అధికారుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది.

యూనిట్ల వివరాలపై ఈడీ నోటీసులు..

గొర్రెల పంపిణీలో గోల్‌మాల్ వ్యవహారం మనీ ల్యాండరింగ్‌గా భావించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)..ఆ స్కాం గుట్టు తేల్చేందుకు చివరి ప్ర యత్నంగా జిల్లాల వారీగా పంపిణీ చేసిన యూని ట్ల వివరాలు కోరింది. 2017 నుంచి 2024 వరకు పంపిణీ చేసిన యూనిట్ల సమాచారం కావాలని ఈ మేరకు జిల్లా వెటర్నరీ, పశు సంవర్ధకశాఖ అధికారులకు ఇచ్చిన నోటీసుల్లో ఈడీ పేర్కొంది. ఈ వివరాలు గత నెలాఖరు వరకే ఈడీకి సమర్పించాల్సి ఉండగా,కొందరు అబ్‌స్ట్రాక్టు మాత్రమే ఇచ్చి, మరి కొందరు సంపూర్ణంగా ఇవ్వగా.. రెండు జిల్లాల నుంచి సమాచారం వెళ్లలేదని తెలిసింది. పంపిణీ చేసిన గొర్రెల యూనిట్ల వివరాలు పంపించని అధికారులు ఈనెల 10 వరకు ఇవ్వాలని మరోసారి రిమైండర్ లేఖ పంపించినట్లు సమాచారం.

అర్జీలు వెంటనే పరిష్కరించాలి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలపై 143 అర్జీలు



హనుమకొండ ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

హన్మకొండ అర్బన్ : వివిధ సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 143 అర్జీలు రాగా.. అందులో జీడబ్ల్యూఎంసీ 16, హౌసింగ్ పీడీ 13, తహసీల్దార్ కాజీపేట 9, తహసీల్దార్ ఎల్కతుర్తి 7, మిగతావి వివిధ శాఖలకు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వైవీ.గణేశ్, డీఆర్డీఓ మేన శ్రీను, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేశ్ తదితరులున్నారు.

ప్రజావాణిలో ఉద్రిక్తత

పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ నడికూడ మాజీ సర్పంచ్ రవీందర్ రావు కలెక్టర్ ప్రావీణ్యతో వాగ్వాదానికి దిగారు. గత ప్రభుత్వ హయాంలో డబ్బులు లేక అప్పులు తెచ్చి గ్రామంలో అభివృద్ధి పనులు చేశామని, ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన అప్పులు తీర్చలేక కుటుంబం రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని, బిల్లులు చెల్లించి న్యాయం చేయాలని కోరారు. ఆందోళనకు దిగిన మాజీ సర్పంచ్‌ను పోలీసులు బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటనతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి..

నిలువ నీడ లేదు.. ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన హర్షం చిలకమ్మ వినతిపత్రం అందజేసింది. దివ్యాంగుడైన కుమారుడితో కలిసి ఆమె కలెక్టరేట్‌కు వచ్చింది. మరో కొడుకు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్నప్పటికీ తనకు నిలువనీడ లేదని, ప్రభుత్వం ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకుంది.

ప్రత్యామ్నాయంగా భూమి ఇవ్వండి..



రావుల సంతోష

భద్రకాళి చెరువు కింద మా కుటుంబానికి సంబంధించి 3.3 ఎకరాల భూమి ఉంది. 1961లో రిజిష్టర్ డాక్యుమెంట్స్ ద్వారా కొన్నాం. 2009 వరకు సాగు చేశాం. చెరువులో నీరు ఉన్నందున ఆ తర్వాత సాగు చేయలేదు. ప్రస్తుతం చెరువులో పూడిక తీస్తున్నందున భూమి స్వభావం దెబ్బతినే అవకాశం ఉంది. అధికారులు ప్రత్యామ్నాయంగా భూమి లేదా మార్కెట్ ధర ప్రకారం డబ్బులు ఇవ్వాలి. ప్రస్తుతం ధరణిలో మా పేరే వస్తోందని రావుల సంతోష వినతిపత్రం అందజేసింది.

పింఛన్ ఇప్పించండి..



కార్తికేయ

కాజీపేట మండలం రహమత్‌నగర్‌కు చెందిన చిదురాల కార్తికేయకు పుట్టుకతో వెన్నెముక లేదు. మాటలు రావు. శారీరక, మానసిక దివ్యాంగుడు. తండ్రి కొంతకాలం కిత్రం రోడ్డుప్రమాదంలో గాయపడగా మతిస్థిమితం కోల్పోయాడు. తాను సంపాదించి ఇద్దరిని పోషించడం, సేవలు చేయడం తనవల్లకాదని తల్లి వెళ్లిపోయింది. ప్రస్తుతం వారి బాగోగులు తాత పరమేశ్వర్‌రావు చూస్తున్నారు. 'మానసిక దివ్యాంగుడైన తన మనుమడికి సదరం సర్టిఫికెట్ ఉన్నా పింఛన్ రావట్లేదని అధికారులు స్పందించి పింఛన్ ఇప్పించాలని' అర్జీ పెట్టుకున్నాడు.

ఆస్తి తీసుకున్నారు.. రేకుల షెడ్డులో ఉంచారు..



నారాయణ దంపతులు

'మాకు ఇద్దరు కొడుకులు. మొత్తం ఆస్తిని వారి పేర్లపై రాయించుకుని ఇప్పుడు మమ్మల్ని పట్టించుకోకుండా రేకుల షెడ్డులో వదిలేశారు'. న్యాయం చేయాలని కోరుతూ కాజీపేట మండలం రాంపూర్‌కు చెందిన చందరాజు నారాయణ భార్య, బంధువులతో వచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కొడుకులకు ఇచ్చిన ఆస్తిలో పావు వంతు తన పేరు మీద చేయాలని, ఇష్టం ఉన్నవారి వద్ద బతుకుతామంటూ వేడుకున్నారు.

వేసవి సెలవుల్లోనే టీచర్లకు శిక్షణ

- డీఈఓ వాసంతి



రిసోర్స్‌పర్సన్ల శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

విద్యారణ్యపురి: పాఠశాల విద్యాశాఖ ఈ వేసవి సెలవుల్లో టీచర్లకు శిక్షణ నిర్వహించనున్నట్లు, ముందుగా రిసోర్స్‌పర్సన్లకు శిక్షణ ఇస్తున్నట్లు హనుమకొండ డీఈఓ వాసంతి అన్నారు. రాష్ట్రస్థాయిలో గణితం, సాంఘికశాస్త్రం సబ్జెక్టుల జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్లకు కాజీపేటలోని ఫాతిమానగర్‌లోని బాలవికాస్‌లో శిక్షణను సోమవారం ఆమె ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న అంశాలతో ఆయా జిల్లాల్లో గణిత, సాంఘిక శాస్త్రం సబ్జెక్టు టీచర్లకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రెండు సబ్జెక్టుల్లో రాష్ట్ర స్థాయిలోని 33 జిల్లాలకు సంబంధించిన ఎంపిక చేసిన రిసోర్స్‌పర్సన్లకు శిక్షణ కార్యక్రమాలు ఈజిల్లాలో ఐదురోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈశిక్షణలో ప్రతీ జిల్లా నుంచి నలుగురు చొప్పున గణితంలో 139 మంది, సాంఘికశాస్త్రంలో 139 మంది జిల్లా స్థాయి రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు. శిక్షణ ఎస్‌సీఈఆర్‌టీ ఫ్యాకల్టీ ఇన్‌చార్జులుగా గణపతిశర్మ, ఎల్లయ్య, స్టేట్ రిసోర్స్ పర్సన్లు బండారి రమేశ్, కందాల రామయ్య రతంగపాణి, ప్రభాకర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా క్వాలిటీ కో– ఆర్డినేటర్ ఎ శ్రీనివాస్, కాజీపేట ఎంఈఓ బండారి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు. ఈనెల 9 వరకు శిక్షణ కొనసాగనుంది.

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి

- నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ



మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ

కాజీపేట అర్బన్: విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించి ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ అన్నారు. నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సోమవారం బేర్ ఫుట్ కౌన్సెలింగ్ థీంతో ఏర్పాటు చేసిన రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిట్ డైరెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అధ్యాపకులు విద్యార్థులకు మనోధైర్యాన్ని అందించేందుకు, ఉత్తమ విద్యను బోధించేందుకు, పరీక్షల్లో రాణించేందుకు రెండు రోజుల వర్క్‌షాప్ తోడ్పడుతుందని తెలిపారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఢిల్లీ ఎక్స్‌ప్రెషన్స్ ఇండియన్ నిపుణులు డాక్టర్ జితేంద్ర నాగపాల్, డాక్టర్ గీతా మెహ్రోత్రా, మాజీ డీజీపీ డాక్టర్ ఆదిత్య ఆర్య, డాక్టర్ అనంత మాధవమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడడం వంటి పిరికి చర్యలకు పాల్పడకుండా, ఓటమిని విజయంగా మలచుకునేందుకు పాజిటివ్ మైండ్‌తో శ్రమించాలని సూచించారు.

నిట్‌తో హార్ట్‌ఫుల్ నెస్ సెంటర్ ఎంఓయూ...

నిట్ వరంగల్‌తో హైదరాబాద్‌లోని హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ సోమవారం పరస్పర ఒప్పందం కుదుర్చుకుంది.

ఐలోని మల్లన్న హుండీ లెక్కింపు

- హుండీ, ఆర్జిత సేవా టికెట్ల ద్వారా సమకూరిన ఆదాయం రూ.25.82 లక్షలు



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, పరిశీలకులు అనిల్‌కుమార్

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ పరిశీలకులు డి.అనిల్ కుమార్ పర్యవేక్షణలో సోమవారం నిర్వహించారు. 29 మార్చి 2025 నుంచి 5 మే 2025 వరకు 37 రోజులకు హుండీల్లో రూ.6,07,555, వివిధ ఆర్జిత సేవా టికెట్ల ద్వారా రూ.25,81,944లు ఆదాయం వచ్చింది. మొత్తం రూ.31,89,499ల నగదు సమకూరినట్లు ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు తెలిపారు. హుండీల్లో లభ్యమైన వెండి, బంగారాన్ని యథావిధిగా హుండీలోనే వేసి సీల్ చేశామన్నారు. లెక్కింపు కార్యక్రమంలో కానిస్టేబుళ్లు డి.సుదర్శన్‌రెడ్డి, జి.పరమేశ్వరి, అర్చక సిబ్బంది, ఒగ్గు పూజారులు మజ్జిగ మహేందర్, అశోక్, మహబూబాబాద్ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మార్కుల బాగోతంలో ఎందరు?

- ఎంఎల్‌హెచ్‌పీ నియామకాలపై అనుమానాలు
- ప్రత్యేక కమిటీతో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయాలి
- విచారణ సజావుగా సాగేనా?
- ఆ అభ్యర్థి వెనుక అధికార పార్టీ కీలక నేత?



ఎంజీఎం: హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఏప్రిల్‌లో చేపట్టిన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ నియామక ప్రక్రియ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో మెరిట్ చూపించి ఉద్యోగం పొందిన వైద్యుడి వెనుక ఓ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్న అధికార పార్టీ నేత ఉన్నాడనే చర్చ వైద్య ఆరోగ్యశాఖలో జోరుగా సాగుతోంది. ఆ అభ్యర్థి మార్కులతో సహా అసలు నిజాలు వెలుగులోకి వచ్చి సుమారు మూడు, నాలుగు రోజులు గడుస్తున్నా.. సదరు అభ్యర్థిపై శాఖాపరమైన చర్యలు తీసుకోకుండా ఆ రాజకీయ నేత జిల్లా ఉన్నతాధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది.

పారదర్శక విచారణ సాగేనా?

తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగం పొందిన అభ్యర్థిపై చర్యలు తీసుకునే క్రమంలో విచారణ పారదర్శకంగా జరుగుతుందా.. లేదా? అనేది సందేహంగా మారింది. 13 మంది పోస్టింగ్‌లలో వచ్చిన మెరిట్ జాబితాలో ఈ ఒక్క అభ్యర్థే తప్పుడు పత్రాలు సమర్పించాడా.. ఇంకా ఎవరైనా ఇలాగే తప్పుడు మార్గంలో ఉద్యోగాలు పొందారా? అనే చర్చ నడుస్తోంది. నియామక ప్రక్రియలో జిరాక్స్ పత్రాల్లో ఎక్కువ మార్కులు చూపించి మెరిట్ పొందినప్పటికీ.. అసలు ఈ అభ్యర్థి ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసిన అధికారులెవరు? వారు ఎందుకు గుర్తించలేకపోయారు? ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారనేది తెలియాల్సి ఉంది. కాగా.. వీరందరిపై ఇప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల మెరిట్ జాబితా.. అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులే కాకుండా.. కలెక్టర్ ప్రత్యేక కమిటీ వేసి విచారణ చేపట్టి అసలు ఎంపిక ప్రక్రియలో మిగతా అభ్యర్థుల ఎంపికనైనా పారదర్శకంగా జరిగిందో లేదో నిగ్గు తేల్చాల్సి ఉంది.

నోటీసు ఇస్తాం..

విచారణలో భాగంగా సదరు అభ్యర్థికి నోటీసు జారీ చేసి విచారణ చేపడతాం. ఈఘటనపై శాఖాపరమైన విచారణ చేపట్టి బాధ్యులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– అప్పయ్య, డీఎంహెచ్ఓ, వరంగల్

విద్యుత్ భద్రత పాటించాలి

ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

ఖిలా వరంగల్: విద్యుత్ భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. విద్యుత్ శాఖ భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం వరంగల్ రంగశాయిపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎన్పీడీసీఎల్ వరంగల్ శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు పెద్దపీట వేసి వినియోగదారులు, రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, అధికారులు, సిబ్బందికి రక్షణ పరమైన పరికరాలు అందజేస్తున్నామని చెప్పారు. ఏదైనా సమస్య వస్తే 1912 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే జేఎల్‌ఎం నియామకాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గౌతమ్‌రెడ్డి, డీఈ టెక్నికల్ ఆనందం, డీఈ ఆపరేషన్స్ మల్లికార్జున్, ఏడీ చంద్రమౌళి, సురేశ్, కిశోర్ పాల్గొన్నారు.

హోటళ్లలో కుళ్లిన మటన్, చికెన్

అపరిశుభ్రంగా వంట గదులు

- హనుమకొండలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ
- నోటీసులు జారీ.. కేసు నమోదు



ఫుడ్ ఆన్ ఫైర్ రెస్టారెంట్ నిర్వాహకుడికి నోటీసు అందిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

హన్మకొండ: హనుమకొండలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. నక్కలగుట్టలోని ల్యాండ్‌మార్క్ హోటల్, నయీంనగర్‌లోని ఫుడ్ ఆన్ ఫైర్ రెస్టారెంట్లలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రోహిత్‌రెడ్డి, స్వాతి, శ్రీశికతో కూడిన బృందం తనిఖీలు చేపట్టింది. ఈరెండు హోటళ్లలో వంట గది పూర్తిగా అపరిశుభ్రంగా, మురికితో, దుర్వాసన కలిగిన రిఫ్రిజిరేటర్‌లో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం.. సరైన ఉష్ణోగ్రతను మెయింటెయిన్ చేయనట్లుగా అధికారులు గుర్తించారు. దాదాపు రూ.45వేల విలువైన 32 కిలోలు నిల్వ చేసిన కుళ్లిన మాంసపు పదార్థాలు, హానికర ప్రమాదకర రంగులు కలిపిన చికెన్, కాలం చెల్లిన ఐస్‌క్రీమ్‌లు, పాల ప్యాకెట్లు, మసాలా పొడులు, ఫంగస్‌తో కూడుకున్న కాలీఫ్లవర్, క్యాబేజీ, ఇతర కూరగాయలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని, శాంపిళ్లు సేకరించారు. బిర్యానీ, ఇతర ప్రాసెస్డ్ ఫుడ్స్ తయారీలో మోతాదును మించి హానికర రసాయనాలతో కూడిన రంగుల వాడకంపై, కుళ్లిన మాంసం, ఫంగస్‌తో కూడుకున్న ఆహారపదార్థాలు వాడకంపై ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీం హెడ్ వి.జ్యోతిర్మయి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఎఫ్.ఎస్.ఎస్ 2006 చట్టాన్ని ఉల్లంఘించినందుకు నోటీసులు జారీ చేశారు. శాంపిళ్లను సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఆహార కల్తీకి, నిబంధనలు పాటించని హోటళ్ల నిర్వాహకులపై కేసు పెడుతున్నట్లు జ్యోతిర్మయి తెలిపారు.



హోటల్ ల్యాండ్‌మార్క్‌లో ఫంగస్ సోకిన తినుబండారం

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా..



ఆర్థికసాయం అందజేస్తున్న సీపీ

వరంగల్ క్రైం : ఆకస్మికంగా మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి తమవంతు బాధ్యతగా సేకరించిన ఆర్థికసాయాన్ని సోమవారం వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ అందజేశారు. కమిషనరేట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బండారి కిరణ్ కుమార్ గతేడాది మరణించాడు. దీంతో తమ మిత్రుడి కుటుంబానికి అండగా ఉండాలనే ఆలోచనతో 2013 బ్యాచ్ కు చెందిన కానిస్టేబుళ్లు వరంగల్ కమిషనరేట్, ఆదిలాబాద్ జిల్లా పోలీస్ కానిస్టేబుళ్లతో పాటు ఇతర విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది రూ.2.50 లక్షల రికరింగ్ డిపాజిట్ పత్రాలతో పాటు రూ.37వేల నగదు ను సీపీ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అదనపు డీసీపీ సురేష్ కుమార్, ఆర్ఐ సింహాచలం శ్రీనివాస్, కానిస్టేబుళ్లు శివ, రాజు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె

హన్మకొండ : ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని ఆర్టీసీ జేఏసీ వరంగల్ రీజియన్ నాయకులు ఎం.శ్రీనివాస్, సీహెచ్.యాకస్వామి, జి.ఎస్.పాణి, బట్టు స్వామి, యు.ఆర్.కృష్ణ, తిరుపతి సోమవారం పేర్కొన్నారు. కార్మిక ద్రోహి అశ్వత్థామ రెడ్డి రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చలు జరపడం సిగ్గుచేటని విమర్శించారు. ఆర్టీసీ జేఏసీతో అశ్వత్థామ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని వారు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తాము సమ్మెలోకి వెళ్లడం లేదని ఆయన చేసిన ప్రకటనను వారు ఖండించారు. అశ్వత్థామ రెడ్డి మాటలను కార్మికులు నమ్మరన్నారు. ప్రభుత్వం డిమాండ్లు పరిష్కరించకపోవడంతో చివరకు సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలైన ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, యూనియన్లను పునరుద్ధరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి కేటాయించాలని, 2021 వేతన సవరణ 21 డిమాండ్లపై రాష్ట్ర జేఏసీతో చర్చించి వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్చలకు పిలువకుండా డిమాండ్ల పరిష్కారంపై స్పష్టత ఇవ్వకపోతే సమ్మెకు వెళ్తామన్నారు. కార్మికులంతా సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.


గుప్తనిధుల కోసం తవ్వకాలు.!

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని జంపన్న వాగు కరకట్ట సమీపంలో ఓ ఇంట్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుగుతున్నాయని గుర్తించిన అదే ప్రాంతానికి చెందిన అన్వర్ ఈనెల 2వ తేదీన రాత్రి 10:45లకు తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేశాడు. గమనించిన సదరు వ్యక్తులు అన్వర్‌పై దాడి చేసి సెల్‌ఫోన్‌ను లాక్కొని వీడియోలు, ఫొటోలు డిలిట్ చేసినట్లు బాధితుడు అన్వర్ తెలిపారు. ఇదే విషయంపై సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్ల డించారు. అసలు గుప్తనిధుల కోసం తవ్వారా? లేదా వారి ఇంటి అవసరాల కోసమా అనేది పోలీసులు విచారణ చేపట్టి తేల్చాల్సి ఉంది. కానీ గ్రామంలో మాత్రం గుప్తనిధుల కోసమే తవ్వినట్లు వినికిడి. అంతేకాకుండా బంగారు బిల్లలు కూడా దొరికినట్లు పుకార్లు షికార్లయ్యాయి. ఈ విషయంపై ఎస్సైను వివరణ కోరగా అన్వర్ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టి కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు.

'సోలార్'పై విముఖత

రుణాలపై స్పష్టత ఇవ్వని బ్యాంకర్లు

- ఈఎండీ చెల్లించేందుకు ముందుకు రాని రైతులు
- ఉమ్మడి జిల్లాలో 682 దరఖాస్తులు
- ఈఎండీలు చెల్లించినది 162.. ముందుకు రాని వారు 520 మంది



ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 889.7 మెగావాట్లకు సరిపడా 682 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 210.6 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు 162 మంది రూ.లక్ష చొప్పున ఈఎండీ చెల్లించారు. 177.1 మెగావాట్లకు గాను 141 మందికి లెటర్ ఆఫ్ ఆక్సెప్టెన్సీ ఇచ్చారు. ఇంకా 520 మంది రైతులు సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై విముఖతతో ఉన్నారు. దరఖాస్తు స్వీకరించడానికి గడువు పొడిగించిన ఆశించిన మేరకు దరఖాస్తులు రాలేదు. అదే విధంగా ఈఎండీ చెల్లించేందుకు దరఖాస్తులు ముందుకు రావడం లేదు.

హన్మకొండ : భారీ పెట్టుబడి.. గిట్టుబాటు కానీ ధర.. 12ఏళ్ల వరకు రైతుకు ప్రయోజనం లేకపోవడం.. రుణంపై బ్యాంకర్లకు స్పష్టత లేక పోవడం.. రైతు వాటాగా రూ.లక్షల్లో చెల్లించాల్సి రావడం.. ప్రతినెల ఆదాయం నిలకడగా వస్తుందనే నమ్మకం లేకపోవడం వెరసి సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై రైతుల్లో తీవ్ర విముఖత వ్యక్తమవుతోంది. దరఖాస్తు చేసినప్పటి ఉత్సాహం ఈఎండీ చెల్లించడంలో రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో పీఎం కుసుం పథకం ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. దరఖాస్తుల స్వీకరణకు మూడు సార్లు గడువు పొడిగించింది. ఇప్పుడు ఈఎండీలు చెల్లించడానికి రెండు సార్లు గడువు విధించింది. అయినా ఈఎండీలు చెల్లించడానికి రైతులు ముందుకు రావడం లేదు. దీంతో ఈ పథకం ఆశించిన మేర సఫలం కాలేక పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమలు

కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు, సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై రైతులను ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఎవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుం) పథకాన్ని తీసుకు వచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ, టీజీ ఎన్పీడీసీఎల్, టీజీ ఎస్పీడీసీఎల్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. రైతులతో పాటు మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాలు, సహకార సంఘాలు, పంచాయతీలు, నీటి వినియోగదారుల సంఘాలు సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు పథకాన్ని రూపొందించారు. ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను స్థానిక డిస్కంలు ముందుగా నిర్ణయించిన టారిఫ్ ధరలకు కొనుగోలు చేస్తాయి. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలం 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు ఐదు కిలోమీటర్ల లోపు దూరం మాత్రమే ఉండాలి. 500 కిలో వాట్ల నుంచి 2 మెగావాట్ల ఉత్పత్తి వరకు సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చు.

సోలార్ ప్లాంట్‌పై అవగాహన లేకనే..

ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌కు రూ.3 కోట్ల ఖర్చు అవుతుంది. ఇందులో రైతులు తమ వాటాగా 25 శాతం భరిస్తే, బ్యాంకుల ద్వారా 75 శాతం రుణ సదుపాయాన్ని కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. కొన్ని బ్యాంకులకు సోలార్ ప్లాంట్‌పై అవగాహన లేదన్నారు. కనీసం 25 శాతం కింద రూ.3 కోట్ల వ్యయంలో రైతు వాటాగా రూ.75 లక్షలు భరించలేమని, అదే విధంగా ప్రభుత్వం యూనిట్‌కు చెల్లిస్తామని చెప్పిన రూ.3.13లు ఏటు సరిపోవన్నారు. 12 ఏళ్ల వరకు రుణ వాయిదాలు చెల్లించాల్సి రావడంతో అప్పటి వరకు రైతుకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదని వాపోయారు. దీంతో తాము నష్టపోతున్నట్లు చెబుతున్నారు.

లాభదాయకంగా లేదు..



మా నాన్న పేరుపై వ్యవసాయ భూమి ఉంది. పీఎం కుసుం పథకం ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేద్దామని దరఖాస్తు చేశాం. యూనిట్ ధర చూస్తే ఏ మాత్రం లాభదాయకంగా లేదు. బ్యాంకర్లు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా లేదు. 25 ఏళ్ల వరకు యూనిట్‌కు రూ.3.13 మాత్రమే చెల్లిస్తుండడం ఏ మాత్రం ప్రయోజనం కాదు. ఇతర రాష్ట్రాల్లో యూనిట్‌కు రూ.4 నుంచి రూ.4.50 వరకు చెల్లిస్తున్నారు. 14, 15 సంవత్సరాల వరకు వచ్చే ఆదాయం వాయిదాలకే వెళ్తుంది. తర్వాతే రైతు చేతికి ఆదాయం వస్తుంది. అప్పటి వరకు పరిస్థితిలు ఎలా ఉంటాయోనని ఈఎండీ చెల్లించలేదు.

– పెసరు కార్తీక్ రెడ్డి, సూదనపల్లి, హనుమకొండ

జిల్లాల వారీగా వివరాలు..

జిల్లా	వచ్చిన		ఈఎండీ		ఎల్ఓఏ	
	దరఖాస్తులు-మెగావాట్లు		చెల్లింపు-మెగావాట్లు		జారీ-మెగావాట్లు	
హనుమకొండ	76	95.2	26	33.2	24	29.2
జేఎస్ భూపాలపల్లి	116	138.8	19	22.8	19	22.8
జనగామ	179	243.2	51	66	41	52
మహబూబాబాద్	127	177.3	41	57.6	33	43.6
ములుగు	50	70.2	5	5	4	4
వరంగల్	134	265	20	26	20	25.5

సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు ముమ్మరం

- కలెక్టర్ రాహుల్‌శర్మ
- 10వ తేదీ వరకు పనులు పూర్తిచేయాలి



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కాళేశ్వరం : కాళేశ్వరంలో ఈనెల 15నుంచి 26వతేదీ వరకు జరిగే సరస్వతీ నది పుష్కరాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ పేర్కొన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్‌తో కలిసి అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. సరస్వతీ(వీఐపీ) ఘాట్, సరస్వతీ మాతా విగ్రహం ఏర్పాటు, శాశ్వత, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం పనులు పరిశీలించారు. టెంట్ సిటీ నిర్మాణానికి సంబంధిత ఏజెన్సీలతో మాట్లాడారు. త్వరగా నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నేటినుంచి సరస్వతిమాత విగ్రహం ఏర్పాటు పనులు జరుగుతుందని తెలిపారు. వీఐపీ ఘాట్ వద్ద తోరణ నిర్మాణ పనులు తక్షణమే చేపట్టాలని ఎండోమెంట్ ఇంజనీర్లకు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. తాగునీరు, భక్తులు దుస్తులు మార్చు గదులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈఓ మహేష్, ఇరిగేషన్ ఈఈ తిరుపతి రావు, డీపీఓ వీరభద్రయ్య, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, ఆర్టీసీ డీఎం ఇందు, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, డీటీ కృష్ణ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఎస్సై తమాషారెడ్డి పాల్గొన్నారు.

మూడు రోజులైతే మళ్లీ విధుల్లోకి..

- సెలవులపై వచ్చిన జవాన్.. రోడ్డు ప్రమాదంలో మృతి
- అందుగులగూడెంలో విషాదం



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు



ప్రకాశ్ (ఫైల్)

కొత్తగూడ : కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్ ఇటీవల సెలవులపై ఇంటికి వచ్చాడు. ఉగ్రవాదుల చర్యతో సెలవులు రద్దయ్యాయి.. మూడ్రోజులైతే మళ్లీ విధుల్లో చేరేవాడు. ఉన్న రెండ్రోజులు బంధువుల ఇళ్లల్లో శుభకార్యాలకు వెళ్లి సంతోషంగా గడపాలనుకున్నాడు.. కాని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు ఒడిలోకి చేరుకున్నాడు. గంగారం మండలం అందుగులగూడెం గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ మద్దెల ప్రకాశ్(32) ఉద్యోగంలో చేరినప్పటి నుంచి దేశ రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహిస్తూ గ్రామస్తులతో కలివిడిగా ఉండేవాడు. గోవిందాపూర్ గ్రామంలో శుభకార్యానికి బంధువుల ఇంటికి ఆదివారం వెళ్లిన అతను రాత్రి తిరిగి వస్తుండగా పెగడపల్లి సమీప మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రకాశ్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై కుశకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నా జీవితం భరతమాత రక్షణకే అంటివి: జవాన్ భార్య అనిత

నా జీవితం భరతమాత రక్షణకే అంటివి కదా అయ్యా.. నీవు లేకుండా నేనెట్లా బతికేది అంటూ జవాన్ ప్రకాశ్ భార్య అనిత రోదనలు మిన్నంటాయి. బార్డర్‌లో ఉన్నా.. నాకు నువ్వు ఉన్నావనే ధైర్యం ఉండేది.. ఇప్పుడు నాకెవరు ధైర్యం అంటూ రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. అనంతరం బీఎస్ఎఫ్ జవాన్ మద్దెల ప్రకాశ్‌కు కొత్తగూడ, గంగారం మండలాల పోలీసులు గౌరవ వందనం చేస్తూ అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

కమలాపూర్ సీహెచ్‌సీలో విచారణ

- బాలింత, ఆమె బంధువులు, వైద్యుల నుంచి వివరాల సేకరణ



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ గౌతం చౌహాన్

కమలాపూర్ : గర్భిణికి ఆపరేషన్ చేసి ప్రసవ అనంతరం గేజ్ ప్యాడ్ తొలగించకుండా మరిచిన ఘటనకు సంబంధించి కమలాపూర్ సీహెచ్‌సీలో డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ గౌతం చౌహాన్ సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బాలింత తిరుమలతో పాటు ఆమె బంధువులు, సీహెచ్‌సీ వైద్యురాలిని విచారించి వివరాలు సేకరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సీహెచ్‌సీలో విచారణ చేపట్టి వివరాలు సేకరించామని తెలిపారు. 3.5 కిలోల బేబీ డెలివరీ కోసం చిన్నపాటి సర్జరీ చేయాల్సి వచ్చిందని, సున్నితమైన ప్రదేశం కావడంతో నరాలు చిట్లి బ్లీడింగ్ అయి కొంత ఇబ్బంది ఏర్పడిందని, ప్రస్తుతం తిరుమల ఆరోగ్యంగా ఉందని పేర్కొన్నారు. పూర్తిగా కోలుకోవడం కోసం వరంగల్ ఆస్పత్రికి తరలించాలని చూశామని, కానీ అందుకు తిరుమల బంధువులు అంగీకరించలేదని, దీంతో వారికి నచ్చిన ఆస్పత్రికి తీసుకెళ్లమని చెప్పినట్లు వివరించారు. ఇక్కడ వైద్య పరంగా ఎలాంటి ఇబ్బంది జరగలేదని, ప్రొటోకాల్ ప్రకారమే డెలివరీ చేశామని వైద్యులు చెబుతున్నారని, విచారణలో భాగంగా ముందస్తుగా వారికి మెమోలు జారీ చేసి విచారణ కొనసాగిస్తామని వెల్లడించారు. విచారణ అనంతరం పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. విచారణ సందర్భంగా స్థానిక కాంగ్రెస్, బీజేపీ నాయకులతో పాటు పలువురు గ్రామస్తులు విచారణాధికారులకు సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందిపై పలు ఆరోపణలతో ఫిర్యాదు చేశారు. పీఓ ఎంసీహెచ్ డాక్టర్ మంజుల, ఎంపీ హెచ్ఈఓ రాజేశ్వర్‌రెడ్డి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ నరేష్, రమ్య పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి

- మావోయిస్టులతో చర్చలు జరపాలి
- కేయూలో విద్యార్థి సంఘాల ర్యాలీ



కేయూలో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, భారత్ బచావో బాధ్యులు

కేయూ క్యాంపస్ : ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాకతీయ యూనివర్సిటీలో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. క్యాంపస్‌లోని ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి యూనివర్సిటీ మొదటి గేట్ వరకు శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న భారత్ బచావో బాధ్యుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాంబ్రహ్మం మాట్లాడుతూ దండకారణ్యంలో కేంద్రం కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ని ఆపివేసి, మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. అపార ఖనిజ సంపద కార్పొరేట్ బహుళజాతి కంపెనీలకు అప్పగించేందుకు అడ్డంకిగా ఉన్న మావోయిస్టులను, ఆదివాసీలను లేకుండా చేయాలనే కుట్రలో భాగంగానే కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను చేపట్టిందని ఆరోపించారు. ర్యాలీలో డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, బీఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షుడు శివ, భారత్ బచావో బాధ్యులు వెంగల్‌రెడ్డి, రాజా మహ్మద్, సదానందం, అరసం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మార్క శంకర్ నారాయణ, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు ఉప్పుల శివ, మహేష్, రాజేష్, శివ, సన్నీ పాల్గొన్నారు.

తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్ పార్టీ

- ఏపీ సీఎం చంద్రబాబు ఏజెంట్ రేవంత్‌రెడ్డి
- కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేయకుండా నిర్వీర్యం చేస్తుండ్రు
- శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి
- కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి

కాళేశ్వరం: కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు పట్టిన శని, దరిద్రం అని శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సోమవారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో 'కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చ.. వాస్తవాలు' అనే కార్యక్రమాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఇందులో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, వాటర్‌బోర్డు కార్పొరేషన్ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, విద్యాసాగర్‌రావు, చిన్నయ్య, చందర్, మాజీ జెడ్పీచైర్‌పర్సన్‌లు శ్రీహర్షిణి, వసంత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. కేసీఆర్ మానస పుత్రిక కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ అంతటికీ సాగు, తాగునీరందించారని, అలాంటి ప్రాజెక్టుకు రిపేర్లు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలించడానికి కాళేశ్వరం ప్రాజెక్టుకు రిపేర్లు చేయడంలేదని, తెలంగాణ రైతులపై చిత్తశుద్ధి ఉంటే మంత్రి శ్రీధర్‌బాబు రిపేర్లు చేయించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ఒక్క పిల్లర్ కుంగితే మొత్తం ప్రాజెక్టు కుంగినట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రతిసమావేశాల్లో ప్రస్తావిస్తున్నారని, ప్రాజెక్టుపై దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. నీటిరంగ నిపుణులు వి.ప్రకాశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బ్యారేజీలు కూలిపోడమే సీఎం రేవంత్ రెడ్డి ఆశయమని, మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంలో ఎవరికీ అనుమానం లేకున్నా.. తనకుందని అనడంలో కుట్ర దాగి ఉన్నదని పేర్కొన్నారు. బ్యారేజీ కుంగిపోవడం, భారీ శబ్దం రావడంపై ఇప్పటికీ ఎన్డీఎస్ఏ నివేదికలు ఇవ్వలేదని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మాట్లాడుతూ.. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి రైతంగానికి నీటిని అందించాలన్నారు. అంతకు ముందు గోదావరిని పరిశీలించారు.

ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావు

- హైకోర్టు జడ్జి జస్టిస్ రాజేశ్వరరావు



కరపత్రం ఆవిష్కరిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్.రాజేశ్వరరావు

మహబూబాబాద్ రూరల్ : జీవితంలో సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, వాటి నివారణకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని హైకోర్టు జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఆత్మహత్యలు-నివారణ సదస్సు కరపత్రాలను జిల్లా కేంద్రంలోని అడ్వకేట్స్ కాలనీలో హైకోర్టు జడ్జి రాజేశ్వరరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవించడానికే జీవితం అని, ఆత్మహత్యలకు పాల్పా డొద్దని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో త్వరలో పోలీసుల సహకారంతో ఆత్మహత్యలు-నివారణ సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

మామిడి ప్యాకింగ్ కేంద్రాల తనిఖీ



తనిఖీ చేస్తున్న మార్కెటింగ్ అధికారులు

వరంగల్ : వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని మామిడి డీలర్ల దుకాణాలతో పాటు ప్యాకింగ్ కేంద్రాలను మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ వి.శ్రీనివాస్, డీఎంఓ సురేఖలు సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మామిడి ప్యాకింగ్ చేస్తున్న విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ..రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేసి మామిడి ప్యాకర్లు, ఆహార భద్రతా నిబంధనలు, మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. వరంగల్‌లోని హరీష్ ఫ్రూట్ కో, ఎస్ఎస్.ఫ్రూట్ కో, అమ్జద్ ఫ్రూట్ కో, ఎస్‌కె ఫ్రూట్ కో, ఎస్ఎఫ్ఎ. ఫ్రూట్ కోలను సందర్శించి మామిడి కాయలు పండుగా మారేందుకు కార్బైడ్, ఇతర రసాయనాలు వాడుతున్నారన్న విషయాలను తనిఖీ చేసినట్లు చెప్పారు. మామిడి కాయలు పండేందుకు ఎగుమతి, బరువు, దూరం ప్రకారం ఒకటినుంచి నాలుగు సాచెట్లు ప్రభుత్వ ఆమోదిత ఇథిలిన్ రైపనర్లు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం నమూనా సాచెట్లను సేకరించి పరీక్షల కోసం హైదరాబాద్‌లోని లేబరేటరీలకు పంపిస్తున్నట్లు జేడీఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీల్లో మార్కెట్ కార్యదర్శి గుగులోత్ రెడ్డి, గ్రేడ్-2 కార్యదర్శి శ్రీరామోజు రాము, సిబ్బంది పాల్గొన్నారు.

పీపీటీ ప్రవేశ పరీక్ష ప్రశాంతం



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు

విద్యారణ్యపురి: పీపుల్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 5, 6, 7 తరగతుల్లో ప్రవేశానికి సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు డి.కిరణ్‌కుమార్ ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులకు 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు హైదరాబాద్‌లోని ప్రగతి విద్యానికేతన్‌లో ఉచిత విద్యను అందిస్తారన్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈ ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పీపుల్స్ ట్రస్ట్ ప్రతినిధి పవన్‌కుమార్, టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.రవీందర్‌రాజు, తాటికాయల కుమార్, పెండెం రాజు, సుజన్‌ప్రసాద్ రావు, జిల్లా కార్యదర్శి సీఎస్ఆర్ మల్లిక్ పాల్గొన్నారు.

బీసీలు రాజకీయ శక్తిగా ఎదగాలి

- బీసీ మేధావుల వేదిక స్థాపక అధ్యక్షుడు చిరంజీవులు



వివిధ అసోసియేషన్ల అధ్యక్షులను సన్మానిస్తున్న చిరంజీవులు, ప్రతినిధులు

రామన్నపేట : బీసీలు రాజకీయ శక్తిగా ఎదిగేందుకు ఉద్యమించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ మేధావుల వేదిక స్థాపక అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు పేర్కొన్నారు. సోమవారం జిల్లా వేదిక అధ్యక్షుడు వీరస్వామి అధ్యక్షత ఐఎంఏ హాల్‌లో బీసీల రాజకీయ నాయకత్వ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ జనాభా 52 శాతం ఉన్నప్పటికి, ఇప్పటికీ అన్ని రంగాల్లో బీసీలు సముచిత స్థానం నోచుకోలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. అనంతరం బీసీ మేధావుల వేదిక వరంగల్, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ల అధ్యక్షులు వలుస సుధీర్, పులి సత్యనారాయణ, ఐఎంఏ గైనకాలజీ విభాగ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మి, కూరపాటి రాధికను ప్రతినిధులు సన్మానించారు. మండల పరుశురాములు, ధర్మపురి రాజగోవిందు, జంగిలి శ్రీనివాస్, పెండెం సంపత్‌కుమార్, జోనాతన్, సూర్యకిరణ్, రాములు, రాజు, ప్రొఫెసర్లు పురుషోత్తం, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో మహిళ మృతి



పార్వతి (ఫైల్)

గార్ల : వడదెబ్బతో మహిళ మృతిచెందిన సంఘటన సోమవారం గార్లలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్లలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన అక్కి పార్వతి (51) రెండ్రోజుల క్రితం మిరప తోటలో కాయలు ఏరేందుకు పనికి వెళ్లింది. ఆదివారం నుంచి వాంతులు, విరోచనాలు కావడంతో అపస్మారక స్థితికి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు సీహెచ్‌సీకి తరలించగా, ఆమె ఆరోగ్యం మరింత క్షీణించింది. అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతిచెందిందని వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, తహసీల్దార్ ఆర్.శారద, ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా సందర్శించి ఆమె మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌కు కేయూ జట్టు

కేయూ క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఈనెల 4న ప్రారంభమై 8వ తేదీ వరకు కొనసాగే ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో కాకతీయ యూనివర్సిటీ పురుషుల జట్టు పాల్గొంటుందని కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై.వెంకయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. జట్టులో డి.శంకరమ్‌కుమార్(ప్రభుత్వ డిగ్రీకాలేజీ తొర్రూరు), బి.శ్రీధర్, ఎల్.అశ్విన్, ఎం.శ్రీచరణ్, బి.సర్దార్(యూఏఎస్‌సీ హనుమకొండ), ఎ.చరణ్‌కుమార్ బి.అవినాష్, జె.అనిల్‌కుమార్(వీసీపీఈ బొల్లికుంట), కె.రాజేశ్, యూ.సురేందర్, ఎం.కుమారస్వామి(యూసీపీఈ కేయూ), బి.రోషన్, ఎం.దిలీప్‌రెడ్డి(కిట్స్ వరంగల్), డి.డేనియల్, జి.కమల్‌రాజ్(ఎంఐఎంఎస్ మంచిర్యాల), డి.నవీన్(కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ హనుమకొండ) ఉన్నారని పేర్కొన్నారు. ఈ జట్టుకు వరంగల్ బొల్లికుంట వాగ్దేవి ఫిజికల్ డైరెక్టర్ బి.పవన్‌కల్యాణ్ కోచ్‌గా, మరో ఫిజికల్ డైరెక్టర్ వి.రామాంజనేయులు మేనేజర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు.